క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని నగరంపాలెం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో డి. నరేష్‌కుమార్ చెప్పారు. స్థానిక ఏటీ అగ్రహారంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రవణ పీఠం సభ్యుల ఆధ్వర్యంలో గుడిబడి సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రణవపీఠం సభ్యులంతా ఆలయంతో పాటు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగరంపాలెం పీఎస్ ఎస్‌హెచ్‌వో నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఆలయాలను శుభ్రపరిచే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పాటు పుణ్య కార్యక్రమాల్ని చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా భావితరాలకు కూడా సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి అలవర్చిన వారమవుతామని చెప్పారు. కార్యక్రమంలో ప్రణవ పీఠం సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా పుస్తకాల ఆవిష్కరణ



పాత గుంటూరు: నగరంపాలెంలోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి వైశ్య హాస్టల్ సమావేశ మందిరంలో ఆదివారం బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రుల అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన, రాయలసీమ తొలితరం నవల ఎం.వి. పాపన్న గుప్త రచించిన 'భానుమతి' పునర్ ముద్రణ పుస్తకాలను ఆవిష్కరించారు. ఆకాశవాణి పూర్వ సంచాలకులు, సులోచనారాణి సాహిత్య వివేచన గ్రంథ సంపాదకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సభకు అధ్యక్షత వహించారు. సాహితీ పోషకులు బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి గ్రంథాల్ని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి సరోజినీ ప్రేమ్‌చంద్ యద్దనపూడి సులోచనారాణితో ఉన్న అనుబంధం, ఆమె సాహిత్య రచనలపై చేసిన సోదాహరణ ప్రసంగం ఆకట్టుకుంది. ప్రముఖ నాటక రచయిత, 2023 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత పిన్నమనేని మృత్యుంజయరావు భానుమతి నవలను విశ్లేషించారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ పర్యవేక్షించారు. ప్రముఖ రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ కృషి



పాత గుంటూరు: పేద విద్యార్థుల ఉన్నతి, విద్యాభివృద్ధికి సౌకర్యాల కల్పనలో రోటరీ క్లబ్ ఆఫ్ సెంటీనియల్ ముందుంటుందని ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని శారదా డిగ్రీ విద్యా సంస్థలకి డిజిటల్ క్లాసులకు అవసరమైన ప్రొజెక్టర్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్, కొమ్మాలపాటి జైష్ణవి, కంచర్ల ఆంజనేయులు, కళాశాల ఈవో శ్రీనివాస్, క్లబ్ సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు స్ఫూర్తి ది ఐక్యూబ్ ఎక్స్‌పో ప్రారంభోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం స్ఫూర్తి-ది ఐక్యూబ్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్ని పరిశ్రమల అవసరాలకు దీటుగా తయారు చేసేందుకు విద్యాసంస్థలు, వైద్యశాలలు, పరిశ్రమల కలయికగా ఎక్స్‌పో ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 3.00 గంటలకు జరగనున్న ప్రారంభోత్సవానికి మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ దేసు రామమోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. మంగళ, బుధవారాల్లో జరగనున్న ఎక్స్‌పోలో వివిధ డిగ్రీ కళాశాలలు, ఆస్పత్రులు, పరిశ్రమలు పాల్గొననున్నాయని రమణ వివరించారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమను కలిసి అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.



ఆధునిక వైద్యంతో అమ్మతనం

కాకుమానుకు చెందిన సరోజ, శ్రీకాంత్ దంపతులకు ఏడేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో ఆందోళనలో పడిపోయారు. బంధువుల ఇళ్లలో శుభకార్యాలకు కూడా హాజరుకాకుండా దూరంగా ఉండి పోయారు. ఒకానొక దశలో వారు ఆత్మహత్యాయత్నం సైతం చేశారు. నేడు ఎంతోమంది ఇలాంటి జంటలు ఆధునిక చికిత్సా పద్ధతులతో సంతానం పొందవచ్చని తెలియక ఇబ్బంది పడుతున్నారు. సంతానం లేకపోవడానికి గలకారణాలు, ఎలాంటి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయో వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న సమస్యలు
- అమ్మతనానికి పలువురు దూరం
- ఆధునిక వైద్యసేవలతో మాతృత్వం
- ఆందోళన చెందవద్దంటున్న వైద్య నిపుణులు

గుంటూరు మెడికల్: వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగక బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. అలాంటి వారికి నేడు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గుంటూరులో సంతానం లేని వారికి వైద్యసేవల్ని అందించేందుకు ప్రత్యేక ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్స్ ఉన్నాయి. వాటిల్లో చికిత్స పొందిన ఎందరో దంపతులు నేడు సంతానం పొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలు పుట్టకపోవడానికి మహిళల్లో కారణాలు

- పెళ్లయిన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవడాన్ని వంధ్యత్వం(ఇన్‌ఫెర్టిలిటీ) అంటారు.
- అండం విడుదల అవ్వకపోవడం
- హార్మోన్ల సమస్య,
- గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు
- గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవడం
- పీసీఓడీ, జువైనల్ టీబీ, అలవాట్లు,
- అధిక మానసిక ఒత్తిడి, అధిక బరువు
- అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవడం
- మూఢనమ్మకాలు
- సెక్స్‌పై ఆసక్తి, అవగాహన లేకపోవడం

మగవారిలో...

- సుఖవ్యాధులు, టీబీ
- స్మోకింగ్, మద్యం, మత్తుపదార్థాల వినియోగం,
- బీర్జాలకు గాయాలు, దెబ్బలు తగలడం
- అంగం సైజుల్లో తేడాలు
- పని ఒత్తిడి,
- కంప్యూటర్‌ను 6 నుంచి 8 గంటల పాటు వినియోగించడం
- రాత్రివేళల్లో ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడటం
- వీర్యకణాలు తక్కువగా ఉండటం
- రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం
- హార్మోన్ సమస్యలు,
- గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం.

అత్యాధునిక వైద్య పద్ధతులు

- సంతానం కోసం చింతించే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజక్షన్ రూపంలో భార్య గర్భంలో పిండాన్ని పెడతారు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశాలు ఉంటాయి.
- భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుంచి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో పెడతారు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.
- ఇంట్రాయుటెరైన్ ఇన్‌సెమినేషన్(ఐయుఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. ఈ విధానంలో 10 నుంచి 20శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.
- భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్యరీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా(అద్దె గర్భం) సంతానం పొందవచ్చు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.
- అండం విడుదల కాని సందర్భాల్లో, పురుష కణాలు తక్కువగా ఉన్న సమయాల్లో మందుల ద్వారా సమస్యను నివారించి పిల్లలు పుట్టే విధంగా చేస్తున్నారు. ఈ విధానంలో 5 నుంచి 10శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.



అందుబాటులో అత్యాధునిక వైద్య పద్ధతులు



సంతాన లేమితో బాధపడే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టేందుకు 23 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయస్సు చాలా అనుకూలం. గర్భం దాల్చేందుకు ముందుగానే ఫోలిక్ యాసిడ్ మింగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ షమా సుల్తానా, ఐవీఎఫ్ నిపుణురాలు, గుంటూరు

వైద్య పరీక్షలన్నీ చేయించాలి



గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ (ఎన్‌టీ) స్కాన్ చేయించాలి. డబుల్‌మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, షుగర్ టెస్ట్, రక్తహీనత టెస్ట్ చేయించాలి. 18 వారాల నుంచి ఐరన్, ఫోలిక్ యాసిడ్ క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలి. గర్భం దాల్చిన 20 నుంచి 22 వారాల్లోగా టీఫా స్కాన్ పరీక్ష చేయిస్తే గర్భంలో ఉండే బిడ్డ గుండె, తల, శరీరం, ఎముకల్లో ఎదుగుదల లోపాలను తెలుసుకోవచ్చు. 24 వారాల తరువాత బీపీ, షుగర్ పరీక్షలు చేయించాలి. 32 వారాలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ , పెట్ స్కానింగ్, సీటీజీ స్కాన్ చేయించాలి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ,ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

బాధితులు అధికం



వందలో 30శాతం సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్నారు. ఉమ్మడి గుంటూరులో 200 మంది గైనకాలజీ వైద్యులు, ఆరు ఐవీఎఫ్ స్పెషాలిటీ సెంటర్స్ ఉన్నాయి. ప్రతినెలా వీరి వద్దకు వెయ్యి నుంచి 1500 జంటలు సంతానం కోసం చికిత్స కోసం వస్తున్నారు. ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులోకి వచ్చాయి. వైద్యుల సలహాలు పాటిస్తూ, క్రమం తప్పకుండా మందులు వాడి ఎందరో దంపతులు సంతానం పొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, గుంటూరు

నేడు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యవర్గ నిర్ణయం మేరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరసింహారెడ్డి, కె.కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లంతా పాల్గొనాలని వారు కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పట్నంబజారు: మహిళ అదృశ్యంపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే రావి రమ చీటీ పాటలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నష్టాలు రావడంతో గుంటూరు ఏటీ అగ్రహారంలోని శ్వేత ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కుమార్తె రావి సాహితి దగ్గరకు కొద్ది రోజుల కిందట వచ్చారు. ఈ నెల 21న రమను సాహితి తిరిగి ఊరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో దింపి వెళ్లిపోయారు. అనంతరం కొద్దిసేపటి తరువాత రైలు ఎక్కిందా.. లేదా ? అని తెలుసుకునేందుకు సాహితి తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల నివాసాల్లో అడిగినప్పటికీ రాలేదని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను దూషించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో సివిల్ కాంట్రాక్టర్ ఇంటికి వెళ్లి ఇద్దరు వ్యక్తులు మహిళలను దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కె.మహేశ్వరరెడ్డి సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రశాంత్, అతని తండ్రి వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డి వద్ద లేబర్ వర్క్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య లావాదేవీల విషయంలో గొడవ జరిగింది. ప్రశాంత్, వెంకటేశ్వర్లు మహేశ్వరరెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడారు. పైగా మహేశ్వరరెడ్డి ఇంటికి వెళ్లి మహిళలను అసభ్యకరంగా దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకల జనుల సంక్షేమమే జగనన్న ధ్యేయం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని
- పాదయాత్ర సమయంలో పేదల కష్టాల చూసి పుట్టిందే మేనిఫెస్టో
- తూచా తప్పకుండా హామీలు నెరవేర్చిన జగనన్న
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు
- 90 శాతం కుటుంబాలకు పూర్తి ఉచితంగా వైద్యం
- 44వ డివిజన్‌లో వేడుకగా 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి రజని, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

పట్నంబజారు: సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గం 44వ డివిజన్ అమరావతి రోడ్డు సత్రం సెంటర్ నుంచి ఆదివారం 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం నిర్వహించారు. పర్యటన ఆద్యంతం ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించడం అనే అంశానికి సమాధానం అన్నట్లుగా తమ ప్రభుత్వ పాలన కొనసాగుతున్నదని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో 86 శాతం సీట్లు, 51 శాతం ఓట్లుతో ప్రజలు జగనన్నను దీవించారన్నారు. వచ్చే ఎన్నికల్లో అంతకుమించి న విజయం కట్టబెట్టేందుకు ప్రజలంతా మరోసారి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. జగనన్న చేపట్టిన పాదయాత్ర అసాధారణ, అరుదైన ఘట్టంగా చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని చెప్పారు. ఎక్కడికక్కడ ప్రజాసమస్యలు ప్రత్యక్షంగా చూస్తూ, ప్రజల కష్టాలు తెలుసుకుంటూ.. బాధితులకు ఓదార్పును అందిస్తూ..వారి కోసం ఎటువంటి పథకాలు చేపట్టాలో..పాదయాత్రలో పునాదిరాళ్లు పడ్డాయని వివరించారు. నవరత్నాలు సహా అనేక పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజల కోసం తానున్నాననే భరోసాని కల్పించారన్నారు. ప్రజల కష్టం కళ్లారా చూసిన జగనన్న ఎంతో చిత్తశుద్ధితో మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి అంశాన్ని తూచా తప్పకుండా నెరవేర్చారని మంత్రి తెలిపారు.

కీలక రంగాలకు ప్రాధాన్యం

విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి కీలక రంగాలకు పెద్దపీట వేయడం ద్వారా జగనన్న ప్రభుత్వ ప్రాధాన్యం ఏమిటో ప్రజలందరికీ అర్థమైపోయిందని మంత్రి పేర్కొన్నారు. పిల్లలకు తాను ఇచ్చే ఆస్తి చదువేనంటూ అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద, విద్యాకానుక, మనబడి, నాడు-నేడు, అంగన్‌వాడీలు వంటి పథకాల్ని పేద వర్గాలకు చేరువ చేశారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం చదువులతో చరిత్ర సృష్టించామని తెలిపారు. రూ 5 లక్షలలోపు సంవత్సరాదాయం ఉన్నవాళ్లందరికీ ఆరోగ్యశ్రీ వర్తింప జేయడం తమ ప్రభుత్వం తీసుకొన్న గొప్ప నిర్ణయాల్లో ఒకటి అని చెప్పారు. ప్రజలందరికీ ఉచితంగా కోవిడ్ టీకా ఇచ్చి దేశం మొత్తం మన వైపు తిరిగేలా చేశామన్నారు. మహిళాసంక్షేమానికీ పెద్దపీట వేసిన ఘనత జగనన్నదేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల వారి అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని తెలిపారు. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లోకే నగదు జమ చేస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని వివరించారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేట్ వంగల హేమలత, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల ఇన్‌చార్జిలు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

క్రెడాయ్ మెగా ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన



బహుమతులు అందజేస్తున్న శివారెడ్డి తదితరులు

పాత గుంటూరు: క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో రింగు రోడ్డు సిద్ధార్థ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన లభించింది. పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. అపార్ట్‌మెంట్స్, ఇళ్లు, ప్లాట్లు కొనుగోలుచేసిన వారికి తక్కువ వడ్డీ రేటుతో రుణసదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. ప్రాపర్టీ షోని నిర్వహించి కొనుగోలుదారులకు అవకాశం కల్పించిన క్రెడాయ్ యాజమాన్యానికి, బిల్డర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం లక్కీ డ్రా నిర్వహించి కస్టమర్లకు బహుమతులు అందజేశారు. చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ ప్రాపర్టీ షోకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నిజం చేసే దిశగా క్రెడాయ్ అద్భుతమైన ప్రయత్నం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు చైర్మన్ ఆరుమళ్ల సతీష్ రెడ్డి, క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము, వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, సెక్రటరీ తియ్యగూర వినోద్ రెడ్డి, ట్రెజరర్ కార్తిక్, జాయింట్ సెక్రటరీ ఆళ్ల నాగార్జునరెడ్డి, షో కన్వీనర్ వెంకటరెడ్డి, ఈసీ మెంబర్స్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



శిలాఫలక ఆవిష్కరణంలో పాల్గొన్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు

- ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, మేయర్ కావటి
- సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్స్‌కు శంకుస్థాపన

గుంటూరు రూరల్: విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. 40వ డివిజన్‌లోని పలకలూరు రోడ్డు రత్నగిరినగర్‌లో ఆదివారం రూ. 123.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణాలకు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సమన్వయకర్త కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 40వ డివిజన్‌లో ఇప్పటికే కొన్నిచోట్ల రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత రహదారి నిర్మాణం వల్ల స్థానిక ప్రజలతో పాటు పల్నాడు జిల్లాకు వెళ్లడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. నగరంలోనుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో వీలుగా ఉంటుందని చెప్పారు. రత్నగిరినగర్ రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలను తొలగించి విస్తరణ కూడా చేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనుల్ని చేపడుతున్ననట్లు వెల్లడించారు. నగర మేయర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నగరంలోని ప్రధాన రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల్ని ఇంటి దగ్గరకే అందిస్తున్నారని తెలిపారు. నగరాభివృద్ధికి కూడా ఆయన పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయాల మేరకు నగరాభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, మిర్చి యార్డు డైరెక్టర్ బొందలపాటి వెంకటేశ్వర్లు , ముత్యాల శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నవజాత శిశు సంరక్షణ కేంద్రం 'వెల్ బేబీ' ప్రారంభం

పాత గుంటూరు: కొత్తపేటలోని కనుమూరి హాస్పిటల్‌లో నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణకు నియోనేటల్ సెంటర్ వెల్ బేబీని ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్. జి. బాబూరావు, డాక్టర్. యం. మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోనేటాలజీ నిపుణులు డాక్టర్ ఏ.వి.ఎస్.రాజు మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టి అతి తక్కువ బరువు కలిగి ఉన్న శిశువుల వైద్యానికి సంబంధించి అత్యాధునికమైన పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరులో ప్రథమంగా వెంటిలేటర్‌పై ఉన్న ఆక్సిజన్ అందని నవజాత శిశువులకు ఇనిహేల్డ్ నైట్రిక్ ఆక్సైడ్ పరికరం అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇంకుబేటర్ ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ లాంటి అధునాతన పరికరాలు కలిగిన అంబులెన్స్‌ను కూడా సమకూర్చామని వివరించారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నెలలు నిండని నవజాత శిశువుల్లో శ్వాసకోశ వ్యాధులు, నిర్ధారణ, చికిత్సకు అవసరమైన నియోనేటర్ బ్రాంకోస్కోపి గుంటూరులోనే మొదటిసారిగా సమకూర్చుకున్నట్లు తెలిపారు. యూనిట్‌లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పలువురు వైద్యులు డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావుకు డాక్టర్ రాజు, డాక్టర్ ప్రియాంకకు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రారంభిస్తున్న డాక్టర్లు బాబూరావు, మధుసూదనరావు

ఘనంగా 'తెలుగు కావ్య మథనం' వార్షికోత్సవం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయం వేదికగా ఆదివారం తెలుగు కావ్య మథనం సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సభకు సంస్థ వ్యవస్థాపకులు పూసపాటి కృష్ణ సూర్యకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు పద్యంపై అభిమానంతో 2019 నుంచి వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక మంది తెలుగు ఉపాధ్యాయులకు పద్యాల్ని ఉచితంగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. పద్య రచనను క్రమబద్ధంగా నేర్పించడమే లక్ష్యం అన్నారు. అతిథులు ఏ. భానుప్రకాష్, ఎస్.సీహెచ్. చక్రవర్తి, చిటితోటి విజయకుమార్, కంది శంకరయ్య ప్రసంగించారు. జయకర్ విశ్వేశ్వర్ కావ్య మథన సమూహ పరిచయం చేశారు. కంది శంకరయ్యకు సమస్యేంద్ర జాలిక బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పూసపాటి దంపతులను విద్యార్థులు, గురువులు ఘనంగా సత్కరించారు. ఘనమైన తెలుగు పద్యం కనుమరుగు కాకూడదనే ఉచితంగా బోధన చేస్తున్నట్లు పూసపాటి దంపతులు తెలిపారు.



పూసపాటి దంపతులకు సత్కారం

లైబ్రరియన్స్‌కి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించాలి

నెహ్రూనగర్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న పీడీ, లైబ్రరియన్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఇంటర్ ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ నాయకులు, లైబ్రరి సైన్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్‌బాబు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీ, లైబ్రరియన్స్‌కు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ 2021లో జీవో నం.76ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. దాన్ని అమలు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోను అమలు చేయాలని ఆయన కోరారు.